క్లుప్తంగా

నియామకం



నూతన కమిటీతో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం, నాయకులు

శంకర్‌పల్లి: కురుమలు అందరూ ఏకతాటిపైకి వచ్చి సమస్యల సాధనకు కృషిచేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం అన్నారు. మండల కేంద్రంలో శనివారం కురుమ సంఘం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా బండమీది వెంకటయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి అందరినీ ఏకం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాపోలు నర్సింలు, బీజేపీ మండల అధ్యక్షుడు దయానంద్, కాంగ్రెస్ పార్టీ మోకిల అధ్యక్షుడు సత్యం, మాజీ ఎంపీపీ నర్సింలు, వైస్ ఎంపీపీ వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మైపాల్, నాయకులు తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

ఎంఈఓ చంద్రశేఖర్



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

కేశంపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని మండల విద్యాధికారి మఠం చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువుల కోసం ఉన్న అవకాశాలను వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ఓంకార్(525), భార్గవలక్ష్మి(514), విజయలక్ష్మి(496), తెలుగు మీడియం పూజిత(462), రజిని(434), అశ్విని(411)ని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి, కృష్ణయ్య, రాజు, పరిమళ, లీనా, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



సంతాపూర్ గ్రామ శివారులో రోడ్డుపై చెట్టును తొలగిస్తున్న సీఐ నరహరి, సిబ్బంది

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్, కొనాయపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. గాలులకు రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో కొత్తపేట నుంచి మహేశ్వరం వైపు, అలాగే కడ్తాల్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. వెంటనే స్పందించిన సీఐ నరహరి, సిబ్బంది గ్రామస్తులతో కలిసి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించారు.

బోరు మోటార్ బిగింపు



బోరుకు మరమ్మతులు చేయిస్తున్న మాజీ సర్పంచ్ లింగం

షాబాద్: గ్రామంలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తానని దామర్లపల్లి మాజీ సర్పంచ్ లింగం అన్నారు. శనివారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో పాతబోరు నీరు సరిగా పోయకపోవడంతో లోతుగా బోరు వేసి గ్రామ ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా తాగు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారని, వారి కష్టాలు చూడలేక పాత బోరుకు మరమ్మతులు చేసి బోరు మోటార్ బిగించామన్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు దయాకర్‌చారి, బుద్ధమల్లి రాజు, అనిల్, నందుచారి, యాదగిరి తదితరులు ఉన్నారు.

గ్రాసం.. గోస!

మూడేళ్లుగా అందని గడ్డి విత్తనాలు

- భారంగా మారుతున్న పశుపోషణ
- పట్టించుకోని అధికారులు

షాబాద్: వేసవి కాలంలో పశువులకు మేతలేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోజురోజుకు పశుపోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం ప్రతీ సంవత్సరం సబ్సిడీపై పంపిణీ చేసే గడ్డి విత్తనాలు గత మూడేళ్లుగా పంపిణీ చేయకపోడంతో పాడి రైతులకు ఇబ్బందిగా మారింది. మండలంలో పశువులు మేకలు, గొర్రెలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికీ కూడా ప్రభుత్వం నుంచి సబ్సిడీ గడ్డివిత్తనాలు పంపిణీ కాలేదు. దీంతో పశుగ్రాసం కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి.

మండలంలో..

షాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 15వేలు పశువులు, 6000 మేకలు, 16,200 గొర్రెలు ఉన్నాయి. వీటన్నింటికీ పశుగ్రాసం కింద 10 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు ప్రతి ఏటా వేసవి కాలంలో అవసరపడతాయి. ప్రతీ సంవత్సరం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేసేవారు. డిసెంబర్ నుంచి జనవరి చివరి వరకు గడ్డి విత్తనాలను పశు వైద్యాధికారులు అందజేసేవారు. కానీ గత మూడు సంవత్సరాల నుంచి సబ్సిడీ గడ్డి విత్తనాలు గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కూడా పంపిణీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారు. వేసవి కాలంలో పశువులు, గొర్రెలు, మేకలకు ఈ గడ్డి ఉపయోగపడేదని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఐదు కేజీల గడ్డి విత్తనాలను సబ్సిడీపై 60 రుపాయలకే అందించేది. బయట ప్రైవేటు మార్కెట్‌లో ఒక కేజీ గడ్డి విత్తనం రూ.120 నుంచి 150 వరకు ఉంటాయని వాపోతున్నారు.

కొనలేక ఇబ్బందులు

ప్రైవేట్ దుకాణాల్లో ఎక్కువ ధర పెట్టి గడ్డివిత్తనాలు



పోలారంలో మేత కోసం పొలాల్లో తిరుగుతున్న గొర్రెలు, మేకలు

కొనడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడం, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఎక్కడ చూసినా పశుగ్రాసం కొరత ఏర్పడింది. ప్రభుత్వం పశుగ్రాసంపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో పశుకాపరులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతీ సంవత్సరం అందించాలి



సబ్సిడీపై ప్రభుత్వం గడ్డి విత్తనాలను పంపిణీ చేయాలి. గడ్డి విత్తనాలు బయట కొనుగోలు చేద్దామంటే ఎక్కువ ధర ఉన్నాయి. ప్రస్తుతం మూగజీవాలు మేత కోసం అల్లాడుతున్నాయి. జనవరిలోనే ప్రతీ సంవత్సరం గడ్డి విత్తనాలు సబ్సిడీపై అందించాలి.

– సత్యానారాయణరెడ్డి రైతు, సంకెపల్లిగూడ, షాబాద్ మండలం

ప్రతిపాదనలు పంపాం



నవంబర్ నెలలోనే మండలానికి 113 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు అవసరమని అధికారులకు నివేదిక ఇచ్చాం. ప్రభుత్వం నుంచి సబ్సిడీ గడ్డి విత్తనాలు రెండేళ్లుగా రావడం లేదు. రైతులు కొంతమేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పశుగ్రాసం కొరత ఉన్నమాట వాస్తవమే.

– చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి, రేగడిదోస్వాడ

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఏఓ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రభుత్వం గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. శ్రమజీవులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ప్రభుత్వం కనీసం నెలకు



ఏఓ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రూ.18వేల వేతనంతో పాటు ఫీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం నాయకులు రత్నం, యాదయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, శంకర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారి అహ్మద్

మొయినాబాద్‌రూరల్: పాడిరైతులు జీవాలకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడ, ఎన్కెపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా పశువులకు ఈ నెల 13వ తేదీవరకు ఉచిత టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరేమియా, గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై



షాబాద్: చందనవెళ్లిలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి సూచించారు. శనివారం మండల పరిధిలోని చందనవెళ్లి, మన్మర్రి, లింగారెడ్డి, గోనిగడ్డ గ్రామాల్లో జీవాలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరాం, అంజయ్య, మహేందర్, రాణి, శ్రీకాంత్, సాయి తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

మొయినాబాద్ రూరల్: బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యం అవుతుందని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో చేవెళ్ల ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎలిగని వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆనంద్‌గౌడ్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పాల్గొని క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో మొదటి సారిగా ప్రధాని మోదీ కులగణన నిర్వహిస్తామని స్పష్టమైన హామీని ఇచ్చారని, దీని ద్వారా వెనుకబడిన వర్గాలకు తగిన న్యాయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఎలిగని వెంకటేశ్‌గౌడ్, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ ప్రధాన కార్యదర్శి అత్తపురం శ్రీనివాస్‌గౌడ్, మోర నర్సింహారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, అశోక్‌యాదవ్, ఆనంద్‌గౌడ్ ఆయా జిల్లాల, మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే బీజేపీ ధ్యేయం

షాద్‌నగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే



మొయినాబాద్ రూరల్: మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మల్చలం మురళీ అన్నారు. దేశంలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శనివారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఈడెన్ ప్లాజా, ఆర్టీసీ కాలనీ, చటాన్‌పల్లి రైల్వేగేట్, జానంపేటలోని గాంధీ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్, నాయకులు వంశీకృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, చెట్ల వెంకటేశ్, శ్రీనివాస్‌చారి, సుధాకర్, నర్సింహ, రాము, శ్రావణ్, శివశంకర్, ప్రవీణ్, బాల్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, సందీప్‌యాదవ్, కొంకళ్ల మణికంఠ, సాయిగౌడ్, విజయ్, సురేష్, ఆంజనేయులు, శ్రీహరి, రామకృష్ణ, వంశీ, గోపి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి

బీజేవైఎం జిల్లా అధికార శివాజీ

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యుడితో పాటుగా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ముల్తాంకార్ శివాజీ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం బీజేపీ నాయకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి నిఖితతో ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న వైద్యుడితో పాటుగా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె వారికి వివరించారు. అనంతరం ఆస్పత్రి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల నూతన భవనాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో డాక్టర్‌తో పాటుగా రేడియాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. ఏఎన్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని, సరైన సిబ్బంది లేకపోవడంతో సబ్‌సెంటర్ల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని ఆయన ఆరోపించారు. 30 పడకల ఆస్పత్రి



అసంపూర్తిగా ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నిర్మాణం ప్రారంభమై మూడు సంవత్సరాలు దాటినా నేటికీ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి, 30 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షులు రొల్ల రఘురాంగౌడ్, మున్నూరు యుగేంధర్, ఐలయ్య, రమేశ్‌గౌడ్, వినోద్‌కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నిరుపేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాలకు సంబంధించి 55 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, 42 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలను ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆడపిల్లలు ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు వసంతం, మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, పాండు, శ్రీను, యాదయ్య, జనార్దన్, రాములు, రవీందర్‌రెడ్డి, రవి, శంకర్, నరేందర్, రాంచంద్రయ్య, తహసీల్దార్ కృష్ణయ్య, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి

శంకర్‌పల్లి: తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ్‌నగర్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ కాలనీ ఏర్పడి దాదాపు 20ఏళ్లు అయ్యిందని, ఇప్పటివరకు సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రాధాన్యత ఇచ్చి మొదటగా అంతర్గత మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కాలనీలో మౌలిక సదుపాయాలైన కరెంట్ స్తంభాలు, తాగునీరు, వీధిదీపాలు, రోడ్లపై గుంతలు తదితర సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని కోరారు. వారి వినతులపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం వీరహనుమాన్ శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 22న నిర్వహించనున్న వీరహనుమాన్ జన్మోత్సవ శోభాయాత్రకు హిందువులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు ప్యాట వంశీ, గిరి, వీహెచ్‌పీ నాయకులు రంగయ్య, బాలబ్రహ్మచారి, సందీప్, రిషికేశ్, దిలీప్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, చెట్లవెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామానికి చెందిన గుటాల మల్లేశ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియలకు గాను రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ జయమ్మ, బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్ ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

కేశంపేట: కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ విమర్శించారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన మండల కేంద్రంలోని మానవ వనరుల భవనంలో సీఆర్పీ రామకృష్ణకు శనివారం సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. మండలంలోని కార్మికులు సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు అక్కమ్మ, వెంకటమ్మ, జగంమ్మ, సునీత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.